

లోవ ఆలయానికి రూ.2 లక్షల విరాళం


తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో అభివృద్ధి పనులకు గంధం రాజేష్‌కుమార్, కానులదేవి దంపతులు (విజయవాడ) బుధవారం రూ.రెండు లక్షల విరాళం అందజేశారు.



విత్తు కొద్దీ పంట

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. అందుకే విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలంటున్నారు. -12లో

డెల్టాకు 500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 100, పశ్చిమ డెల్టాకు 200 క్యూసెక్కుల నీటిని వదిలారు. 15,770 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు.

న్యూస్‌రీల్

బాల కార్మికులు పాఠశాలల్లో చేరేలా డ్రైవ్

అమలాపురం రూరల్: బాల కార్మికులను గుర్తించి వారు పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించడానికి నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సంక్షేమ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహణ, బిల్డర్ల నుంచి లేబర్ సెస్ (1 శాతం) వసూలు, భవనాలు, ఈ-శ్రమ్ లక్ష్యాల పురోగతి పై సమీక్షించారు. కార్మికులు పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ఆయుష్మాన్ భారత్ కింద ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఈ యాప్‌లో అడిగిన వివరాలు అందిస్తే గుర్తింపు కార్డు జారీ అవుతుందన్నారు. కోనసీమ జిల్లాకు 8 లక్షల కార్మికులను ఈ శ్రమ నమోదు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటి వరకు 2.8 లక్షల ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయని, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్మిక చట్టాల ప్రకారం జిల్లాలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో పని చేస్తున్న బాల కార్మికులను గుర్తించేందుకు దాడులు నిర్వహిస్తూ వారికి పునరావాసం కల్పించడం వంటి బాధ్యతలను జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ నిర్వహించాలన్నారు. డీఆర్‌ఓ రాజకుమారి, కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఆర్‌డీఏ పీడీ గాంధీ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి డీఎస్సీ పరీక్షలు

అమలాపురం రూరల్: జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమీక్షించి పటిష్ట ఏర్పాట్లు చర్యలు అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ జిల్లాలో శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు రెండు కేంద్రాలలో మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్స్‌లో నిర్వహిస్తారు. భట్లపాలెంలోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, చెయ్యేరు గ్రామంలోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్‌లో పద్ధతిలో పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ప్రతి సెషన్‌కి 150 మంది చొప్పున రోజుకి ఒక్కో పరీక్షా కేంద్రంలో 300 మంది పరీక్షకు హాజరయ్యేలా ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరయ్యే దివ్యాంగులకు సహాయకులను(స్క్రైబ్ లను) అనుమతించేలా జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు చేపడతారన్నారు.



కొత్తపేట నియోజకవర్గం పరిధిలో రావులపాలెంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట నియోజకవర్గం పరిధిలోని రావులపాలెంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టారు. కోనసీమ ముఖద్వారం వద్ద ఉన్న పార్టీ కార్యాలయం వద్దకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి పార్టీ శ్రేణులు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రావణాసురుని ఆకృతిలో తయారు చేసిన చంద్రబాబు చిత్రపటానికి పది తలలు పెట్టారు. వాటిపై సూపర్ సిక్స్ పథకాల పేర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉన్న వైఎస్సార్, చిర్ల సోమసుందర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ ఆఫీసు నుంచి జెండాలు, ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకొని జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. కళా వెంకట్రావు సెంటర్ నుంచి బలరామిరెడ్డి ఆసుపత్రి జంక్షన్ మీదుగా యూటర్న్ తీసుకుని తిరిగి కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకుని, అక్కడ నుంచి రింగ్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ముక్తేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. జగ్గిరెడ్డి సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలంటూ ప్రసంగించారు.



మండపేట పట్టణంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

మండపేటలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట తిమూర్తులు ఆధ్వర్యం వహించారు. పట్టణంలోని విజయలక్ష్మీనగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా నిరసన ర్యాలీ నిర్వహించారు. రాజారత్న సెంటర్ వద్ద దివంగత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి బస్‌స్టాండ్ మీదుగా కలువపువ్వు సెంటర్ వరకూ ర్యాలీ కొనసాగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నాయకులు వినతిపత్రం అందజేశారు. పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటుపై కన్నెర్ర

- కూటమి ప్రభుత్వ తీరుపై... గళమెత్తిన వైఎస్సార్ సీపీ
- కోనసీమలో 'వెన్నుపోటు దినం'
- ఏడు నియోజకవర్గాలలో కదం తొక్కిన పార్టీ శ్రేణులు
- కూటమి ఏడాది పాలనపై వెల్లువెత్తిన నిరసన
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు
- రావులపాలెంలో పాల్గొన్న పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి
- పలుచోట్ల మోటార్ సైకిళ్ల ర్యాలీలు
- రెవెన్యూ అధికారులకు విజ్ఞాపన పత్రాల అందజేత

సాక్షి, అమలాపురం: కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పాలనా కాలంలో సంక్షేమం పథకాల అమలు విషయంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి... ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేయడానికి నిరసనగా బుధవారం వైఎస్సార్ సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం నిరసనలు జిల్లా వ్యాప్తంగా హోరెత్తాయి. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి. దీనిలో భాగంగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం మోసం, దగాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, జనం ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రామచంద్రపురం మెయిన్‌రోడ్డులో పార్టీ కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్



ముమ్మిడివరంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఇతర నాయకులు

ముమ్మిడివరంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం జరిగింది. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి పోలమ్మ చెరువు అంబేడ్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ జరిగింది. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, పార్టీ కోఆర్డినేటర్ సూర్యప్రకాష్‌లు నేతృత్వం వహించారు. పార్టీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేశారు అనంతరం ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని ఆర్డీవో అఖిలకు వినతి పత్రం అందించారు.



వెన్నుపోటు దినం కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ పార్లమెంట్ కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, అసెంబ్లీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్

అమలాపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన పార్టీ పార్లమెంట్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పినిపే విశ్వరూప్, అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగింది. భట్నవిల్లిలోని విశ్వరూప్ ఇంటి వద్ద నుంచి బైక్ ర్యాలీ మొదలై నల్లవంతెన, ఎర్ర వంతెన మీదుగా కలెక్టరేట్ వద్దకు చేరుకుంది. కలెక్టరేట్ వద్ద కొద్దిసేపు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. అనంతరం డీఆర్వో రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలో పాల్గొన్న పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరంలో వైఎస్సార్ సీపీ నియోకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పి.గన్నవరం అక్విడెక్టు నుంచి మూడు రోడ్ల సెంటర్ మీదుగా వెన్నుపోటు ర్యాలీ సాగింది. వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యానారాయణకు వినతిపత్రం అందజేశారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి పాల్గొన్నారు.



మలికిపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

రాజోలులో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం చేపట్టారు. మలికిపురంలో నల్లి కామేశ్వరరావు ఇంటి వద్ద ఉన్న పార్టీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ ప్రారంభమైంది.

ప్రధాన కూడలి మీదుగా సెంటర్‌కు వచ్చి అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ సాగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నాయకులు వినతిపత్రం అందజేశారు.

నేటి నుంచి బాలాజీ కల్యాణోత్సవాలు

రేపు స్వామివారి తిరు కల్యాణం



మామిడికుదురు: ఉత్తర వాహినిగా ప్రవహిస్తూ కాశీలో గంగానది అంతటి ప్రాముఖ్యతను సంతరించుకున్న పవిత్ర వైనతేయ గోదావరి నదీ తీరంలో వెలసిన బాల తిరుపతి అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాలు గురువారం నుంచి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్వామి వారి దివ్య తిరు కల్యాణం శుక్రవారం రాత్రి 9.15 గంటలకు జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుభ ముహూర్తంలో జరుగుతుందని ఈఓ తెలిపారు. గురువారం జ్యేష్ఠ శుద్ధ దశమి ఉదయం ఆరు గంటలకు విశ్వక్సేనారాధనతో కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. శ్రీదేవి, భూదేవితో పాటు బాల బాలాజీని వధువు, వరులుగా చేసి బుగ్గన కల్యాణం తిలకం తీర్చిదిద్దే మహత్తర ఘట్టంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, సహస్ర నామార్చన నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటలకు స్వామి వారి రాయబారోత్సవం జరుగుతుంది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు వేద సదస్యం (పండిత సన్మానం) ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామి వారికి పవిత్ర వైనతేయ గోదావరి నదిలో చక్రస్నానం నిర్వహిస్తారు. సోమవారం ఉదయం 9 గంటలకు చోర సంవాదం, సాయంత్రం ఏడు గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం, ఋత్విక్ సన్మానంతో స్వామి వారి కల్యాణోత్సవాలు సంపూర్ణమవుతాయి. కల్యాణోత్సవాలు జరిగే అయిదు రోజులు ఆలయం వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాల నిర్వహణకు ఆలయం వద్ద భారీగా ఏర్పాట్లు చేశారు. భారీగా విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. స్వామి వారి ఆలయాన్ని పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఫీజు రాయితీకి వినతి

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థలలో ఎల్‌కేజీ నుండి ఇంటర్ వరకు చదువుకుంటున్న జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్‌ను కోరుతూ ఏపీ యూడబ్ల్యూజే జిల్లా శాఖ అధ్యక్షుడు మండేల నాగ వెంకట ప్రసాద్ (బాబి), జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు కొర్లపాటి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారికి వినతి పత్రం అందించారు. జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలు 2025-26 సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు 50శాతం ఫీజుఫీజు రాయితీ అమలు చేయాలని కోరారు. కలెక్టర్‌తో చర్చించి జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి హామీ ఇచ్చారు. యూనియన్ జిల్లా కోశాధికారి ఎంవీ అబ్బాస్, సంయుక్త కార్యదర్శి ఏడిద దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

'కోరింగ'లో 'స్పాట్-టెయిల్డ్ పిట్ వైపర్'

- అత్యంత విషపూరితం
- కాటేస్తే ప్రాణానికే ప్రమాదం
- పసర పాము అనుకునేరు జాగ్రత్త సుమా!
- భవిష్యత్తులో అంతరించిపోయే జాతిగా నిర్ధారణ
- షెడ్యూల్ 4 నుంచి 1కి మార్పు
- దేశంలో మూడో అతి పెద్ద కోరింగ అభయారణ్యంలో గుర్తింపు
- పరిరక్షణకు నడుం బిగించిన వన్యప్రాణి విభాగం



అభయారణ్యంలో చెట్టుపై, నేలపై 'స్పాట్-టెయిల్డ్ పిట్ వైపర్'



సాక్షి ప్రతినిధి, కాకినాడ: భవిష్యత్‌లో అంతరించిపోయే జాతుల జాబితాలో ఉన్న స్పాట్-టెయిల్డ్ పిట్ వైపర్ జాతి పాము కాకినాడ సమీపాన గుర్తించారు. దేశంలోనే మూడో అతి పెద్ద కోరంగి అభయారణ్యంలో ఈ పాము తారసపడింది. దాదాపు 40 ఏళ్ల క్రితం జనవాసాల్లో కనిపించే ఈ అరుదైన జాతిపాము సమీప భవిష్యత్‌లో అంతరించిపోయే జాతుల్లో ఒకటిగా చేరింది. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1978 ప్రకారం ఈ పాము నాలుగో షెడ్యూల్‌లో ఉంది. అటువంటి ఈ జాతి పాము పరిరక్షణ కోసం తక్షణం ప్రయత్నించకుంటే అంతరించిపోతున్న జాతుల్లో చేరిపోతుందని వన్యప్రాణి సంరక్షణా విభాగం గుర్తించింది. ఈ నేపథ్యంలో స్పాట్-టెయిల్డ్ పిట్ వైపర్ పామును నాలుగో షెడ్యూల్ నుంచి ఒకటో షెడ్యూల్‌లోకి చేర్చారు. ఈ షెడ్యూల్ మార్పు ద్వారా అత్యంత జాగ్రత్తతో ఈ జాతి పామును రక్షించాలనే సందేశాన్ని ఇచ్చినట్టు వన్యప్రాణి విభాగం అధికారులు చెబుతున్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ముందుచూపుతోనే 2022లో షెడ్యూల్ మార్చారు.

పొడ పాము సంతతికి చెందిన ఈ పాము పచ్చరంగులో ఉంటుంది. ఈ జాతిలో రెండు రకాలు బాంబోపిట్ వైపర్, స్పాట్ వైల్డ్ పిట్‌వైపర్ ఉన్నాయి. బాంబో పిట్ వైపర్ సాధారణంగా ఆటవీ ప్రాంతమైన రంపచోడవరం ఏజెన్సీలోని మారేడుమిల్లి, వై.రామవరం, అడ్డతీగల తదితర ప్రాంతాల్లో ఉంటుంది. స్పాట్ వైల్డ్ పిట్ వైపర్ జాతి పాములు చిత్తడి నేలల్లో (మాంగ్రూవ్స్) మాత్రమే మనగలుగుతాయి. ఈ పాము మనిషిపై దాడి చేసినప్పుడు రక్తంలో బ్లడ్ క్లాట్స్ ఏర్పడతాయి. దీంతో బ్రెయిన్ డెడ్ కావడం, హార్ట్ అటాక్, కోమాలోకి వెళ్లడంతో ప్రాణానికే ప్రమాదం ఏర్పడతాయి. అయితే, ఇంతవరకూ ఈ జాతి పామువల్ల ఇలాంటి కేసులు ఎక్కడా నమోదు కాలేదు. ఈ పాములు పగలు నిద్రావస్థలో ఉండి, రాత్రి పూట మాత్రమే సంచరిస్తుండటంతో ప్రజల ప్రాణాలకు పెద్దగా ప్రమాదం ఎదురు కాలేదు. ఈ జాతి పాములు ఎక్కువగా దక్షిణ ఆసియా, మయన్మార్‌లలో మాత్రమే కనిపిస్తుంటాయి. దీనిని ఒక విషపూరితమైన పాము జాతిగా తేల్చారు. ఈ పాము విషం చాలా శక్తిమంతమైనదిగా నిర్ధారించారు. ఈ పాము కాటు వేసినప్పుడు సకాలంలో వైద్య అందకపోతే ప్రాణాంతకమే. ఆకుపచ్చ రంగులో ఉండి శరీరంపై చిన్న చిన్న ఎరుపు మచ్చలు కూడా కనిపిస్తుంటాయి. తల భాగం ఒకే రీతిలో చిలకాకుపచ్చ, వెనుక ప్రకాశవంతమైన ఆకుపచ్చ రంగు కలిగి ఉంటుంది. పచ్చని చెట్లపై సంచరిస్తూండటంతో ఈ పామును స్థానికులు పసర పాముగా భావించి ఉదాసీనంగా ఉంటే ప్రాణాలకే ప్రమాదం. జీవ వైవిధ్యంలో విశేషతను సంతరించుకుందని వన్యప్రాణి విభాగ అధికారులు చెబుతున్నారు. ఈ పాముకు ఉప జాతులేమీ ఇంత వరకూ గుర్తించ లేదు. ఇటువంటి లక్షణాలున్న పాము కోరంగి అభయారణ్యంలో రికార్డు కావడంతో దీని పరిరక్షణ కోసం వన్యప్రాణి విభాగం ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమాయత్తమవుతోంది.

మగ పాము గరిష్ఠంగా 575 మిల్లీమీటర్లు (22.6 అంగుళాలు) పొడవున పెరుగుతాయని నిర్ధారించారు. వీటి తోక పొడవు 120 మిల్లీమీటర్లు (4.7 అంగుళాలు) పైనే ఉంటుంది. ఆడ పాము అయితే గరిష్ఠంగా 1,045 మిల్లీమీటర్లు (41.1 అంగుళాలు) పొడవు, తోక చూస్తే 165 మిల్లీమీటర్లు (6.5అంగుళాలు) పొడవు ఉంటుంది. మగ పాము కంటే ఆడ పాము పొడవు ఎక్కువగా ఉంటుంది.

పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్నాం



మడ అడవులకు వచ్చే పర్యాటకులకు ఈ విషయంలో ముందు జాగ్రత్తలు చెబుతాం. చెట్లు ఎక్కవద్దు, లోపలకు వెళ్లవద్దంటూ హెచ్చరించి పంపిస్తాం. ఒకవేళ ఈ పాము కాటు వేస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. ఈ పాము కరవగానే విరుగుడుకు ఇంజక్షన్ చేయించాలి. ఈ ఇంజక్షన్ కోరంగి అభయారణ్యం సమీపాన తాళ్లరేవు పీహెచ్‌సీ లేదా కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రిలో ఉంటుంది. కాలు మీద కాటేస్తే ఎక్కువగా నడవకూడదు. కట్టుకట్టకుండా ఆస్పత్రికి తరలించాలి. ఈ విషయాలపై ముందుగా అవగాహన కల్పిస్తున్నాం.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, అటవీ రేంజర్, వన్యప్రాణి విభాగం, కోరంగి అభయారణ్యం, కాకినాడ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్




కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

విత్తు కొద్దీ పంట



విత్తనాల బస్తాలు



నారుమడిని సిద్ధం చేసుకుంటున్న రైతులు

- నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి
- పంట దిగుబడిలో మొలక శాతం కీలకం
- విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయ నిపుణులు

రాయవరం: వ్యవసాయ అవసరాలకు ఈ ఏడాది జూన్ ఒకటో తేదీన నీరు విడుదల చేసినట్టు ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. పూర్తి స్థాయిలో పొలాలకు నీరు రావడానికి వారం రోజులు పట్టే అవకాశముంది. ఈలోగా వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు ఇప్పటికే వరి నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు రైతులు సొంతంగా తయారు చేసుకున్న విత్తనాలను వినియోగిస్తుండగా, మరి కొందరు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఖరీఫ్‌లో అధికంగా రైతులు స్వర్ణ రకాన్ని సాగు చేస్తారు. నారుమళ్లు వేసుకునే సమయంలో రైతులు విత్తన ఎంపికకు అధిక ప్రాధాన్యమివ్వాలని, విత్తనం ఎంపికపైనే పంట దిగుబడి ఆధారపడి ఉంటుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొత్తం 1,63,365 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

నాలుగు రకాల్లో..

నాణ్యమైన విత్తనాలు బ్రీడర్, ఫౌండేషన్, సర్టిఫైడ్, ట్రూత్‌ఫుల్ లేబుల్స్‌లో లభ్యమవుతాయి.

బ్రీడర్ విత్తనం

న్యూక్లియర్ సీడ్ మూల విత్తనం నుంచి బ్రీడర్ విత్తనాన్ని తయారు చేస్తారు. ఇది అన్ని రకాల విత్తనాలకు మూల విత్తనం. దీన్ని కంపెనీలు ఆయా బ్రీడర్ల పర్యవేక్షణలో పండిస్తారు. వ్యవసాయ పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు రూపొందించేవి ఇటువంటి విత్తనాలే. ఈ విత్తనం 100 శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. బ్రీడర్ సీడ్‌కు బంగారు రంగు ట్యాగ్ వేస్తారు. సీడ్ ధర ఎక్కువ. రైతులకు రెండు కిలోలకు మించి బ్రీడర్ సీడ్ ఇవ్వరు.

ఫౌండేషన్

ఈ విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుంచి ఉత్పత్తి చేస్తారు. వివిధ విత్తనోత్పత్తి సంస్థలు, సాంకేతిక నిపుణుల ఆధ్వర్యంలో పండిస్తారు. దాదాపు 100 శాతం జన్యు నాణ్యత కలిగి ఉంటుంది. ప్రైవేటు విత్తన కంపెనీలు వ్యవసాయ పరిశోధన కేంద్రాల నుంచి బ్రీడర్ విత్తనాలు తీసుకుని వెళ్లి ఫౌండేషన్ విత్తనాన్ని తయారు చేస్తాయి. ఈ సీడ్‌కు తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు.

సర్టిఫైడ్(ధ్రువీకరించిన)

విత్తనం నుంచి నేరుగా సర్టిఫైడ్ విత్తనాలను ఉత్పత్తి చేస్తారు. వివిధ సంస్థలు, రైతుల పొలాల్లో కూడా విత్తన పర్యవేక్షకుల సమక్షంలో పండించే అవకాశం ఉంది. ఈ విత్తనానికి నీలి రంగు ట్యాగ్ వేస్తారు. ఏపీ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ ద్వారా సర్టిఫై చేస్తారు.

ట్రూత్‌ఫుల్ లేబుల్

ఈ విత్తనాలను ట్రూత్‌ఫుల్ లేబుల్ కింద రైతులకు విత్తన కంపెనీలు విక్రయిస్తుంటారు. ట్రూత్‌ఫుల్ లేబుల్ విత్తనాలకు ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు. లేబుల్ ట్యాగ్‌పై విత్తన పరీక్ష చేసిన తేదీ ఉంటుంది. ఆ తేదీ నుంచి తొమ్మిది నెలల కాల పరిమితిలోపు విత్తనాన్ని కొనుగోలు చేయవచ్చు.

జాగ్రత్తలు వహించాలి



విత్తన ఎంపికలో రైతులు అత్యంత జాగ్రత్తలు వహించాలి. ఇప్పటికే రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. పంట కాలువలకు పూర్తి స్థాయిలో నీరు వచ్చిన అనంతరం వెదజల్లు సాగుకు కూడా ప్రాధాన్యమివ్వాలి. ముందస్తు సాగు చేపడితే రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

– కొప్పిశెట్టి ప్రభాకర్,
మండల వ్యవసాయాధికారి, రాయవరం

పాటించాల్సిన సూచనలివే..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై నంబరు, విత్తన రకం, గడువు తేదీలు, డీలరు సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయరాదు.
- గడువు దాటిన విత్తనాలను కొనుగోలు చేయకూడదు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్లపై సీలు ఉందో లేదో చూసుకోవాలి.
- కొన్న విత్తనాలను డీలరు వద్దే తూకం వేయించాలి.
- వేసవి దృష్ట్యా ప్రతి రైతు తప్పనిసరిగా మొలక శాతం పరీక్ష చేయాలి.
- 100 గింజలకు 80 గింజలు మొలక వస్తే నాణ్యమైన విత్తనంగా పరిగణించవచ్చు.
- మొలక శాతం తక్కువగా ఉన్నట్లు రైతులు గుర్తిస్తే వెంటనే వేరే లాట్ నంబర్ నుంచి విత్తనాన్ని పొందే అధికారం వారికి ఉంది. దీనికి వ్యవసాయాధికారులు కూడా సహకరిస్తారు.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.
- కొనుగోలు చేసిన విత్తన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలి.
- అరువు పద్ధతిలో విత్తనాలు కొనుగోలు చేసినా సరే బిల్లు తీసుకోవాలి.

కారుపై కూలిన కొబ్బరి చెట్టు



సఖినేటిపల్లిలంకలో కారుపై పడిన చెట్టు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక గ్రామంలోని ప్రధాన రహదారిలో బుధవారం ఓ కారుపై కొబ్బరి చెట్టు కూలింది. ప్రయాణికులతో వెళుతున్న ఈ కారు ముందు భాగంపై చెట్టు కూలినప్పటికీ, అందులో ఉన్నవారు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కారు రామాలయం వద్దకు చేరుకునేసరికి అకస్మాత్తుగా రోడ్డు పక్కనున్న కొబ్బరి ముచ్చెట్టు(శిథిల చెట్టు) విరిగిపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్ట్

నిడదవోలు రూరల్: సెల్‌ఫోన్‌లోని యాప్‌తో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు బుధవారం తెలిపారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలోని లోహియనగర్‌కు చెందిన మన్యం శివ మంగళవారం రాత్రి ఐపీఎల్ ఫైనల్‌లో భాగంగా ఆర్సీబీ, పంజాబ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు యాప్ ద్వారా బెట్టింగ్ చేస్తుండగా అరెస్ట్ చేసినట్టు చెప్పారు. బెట్టింగ్‌కు వినియోగిస్తున్న సెల్‌ఫోన్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

రైల్వే ట్రాక్ వద్ద మృతదేహం

కడియం: ద్వారపూడి–కడియం స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ వద్ద బుధవారం సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని పురుష మృతదేహం లభ్యమైందని ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపారు. లేత ఆకుపచ్చ రంగు ప్యాంట్ మాత్రమే ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్టు చెప్పారు. ఇతడి వివరాలు తెలిస్తే 94406 27551 నంబర్‌లో తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా

బాలుడిని బలిగొన్న లారీ

ఘటనలో మేనత్తకు తీవ్ర గాయాలు



గాయపడిన శారదలీలను 108తో తరలిస్తున్న సిబ్బంది



అఖిల్ (ఫైల్)

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందగా, ఉపాధ్యాయురాలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు, కోరుకొండలో శారదలీల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కాకినాడకు చెందిన తన మేనల్లుడు భాష్యం అఖిల్ (11) వేసవి సెలవుల కారణంగా కొద్ది రోజులుగా కోరుకొండలోని తన మేనత్త శారదలీల వద్ద ఉంటున్నాడు. ప్రత్తిపాడులోని బంధువుల ఇంటికి వారిద్దరూ స్కూటీపై బయలుదేరారు. ఎన్‌హెచ్‌పై పోలవరం కాలువ సమీపంలో వారి స్కూటీని లారీ ఢీకొంది. ఈ ఘటనలో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ తరలిస్తుండగా అఖిల్ మార్గం మధ్యలో మృతి చెందాడు. శారదలీలను కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న మినీవ్యాన్

ముమ్మిడివరం: మోటార్ బైక్‌పై ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులను వెనుక నుంచి మినీ వ్యాన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన ఇది. ముమ్మిడివరం నగర పంచాయతీ టీటీఆర్ నగర్‌కు చెందిన ఏడిద సోమరాజు, అతని కుమారుడు సుదర్శన్ మోటార్ బైక్‌పై బుధవారం అమలాపురం వైపు వెళుతున్నారు. మహిపాల చెరువు సెంటర్‌లో వెనుక నుంచి వచ్చిన మినీవ్యాన్ వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తండ్రీకొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో అమలాపురంలోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

బిడ్డను చంపి.. తనువు చాలించి..



కియాన్ ప్రశాంత్‌తో తల్లి దీప్తి (ఫైల్)

- కాకినాడలో ఓ మహిళ ఘాతుకం
- అత్తింటి వేధింపులే కారణమని మృతురాలి తల్లి ఆరోపణ

కాకినాడ క్రైం: కన్న పేగుని చిదిమేసి తానూ తనువు చాలించిన తల్లి హృదయ విదారక సంఘటన కాకినాడలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు, రాజమహేంద్రవరానికి చెందిన గుడేటి రమ్యదీప్తి(30)కి ఐదేళ్ల క్రితం కాకినాడ రేచర్లపేట దొర్లవారి వీధికి చెందిన రాజాల శరత్‌తో వివాహమైంది. ఈ దంపతులు అబుదాబీలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు కియాన్ ప్రశాంత్ ఉన్నాడు. రెండు నెలల క్రితం రమ్యదీప్తి అబుదాబి నుంచి తన కుమారుడితో కలిసి రాజమహేంద్రవరానికి వచ్చింది. అక్కడ ఒకటిన్నర నెలల పాటు ఉండి, సుమారు పది రోజుల క్రితం కాకినాడలోని అత్తయ్య ఇంటికి వచ్చి ఉంటోంది. ఏమైందో, ఏమో మంగళవారం రాత్రి నిద్రపోయేందుకు కుమారుడితో కలిసి తన గదిలోకి వెళ్లింది. ఉదయం ఎంతకూ తలుపు తీయకపోయేసరికి దీప్తి అత్తయ్య, ఆడపడుచు కిటికీ నుంచి గదిలోకి చూశారు. దీప్తి ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. ఆమె కుమారుడు మంచంపై నిర్జీవంగా పడి ఉన్నాడు. పొరుగు వారి సాయంతో తలుపులు తెరిచిచూడగా.. దీప్తి అప్పటికే చనిపోయి ఉంది. బాలుడు ప్రశాంత్‌కు ముక్కు, నోటికి ప్లాస్టర్లు వేసి ఉన్నాయి. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. టూ టౌన్ ఇన్‌చార్జి సీఐ సత్యనారాయణ, ఎస్సై తులసీరామ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీప్తి ఆత్మహత్యకు పాల్పడిందని, అంతకు ముందు తన కుమారుడి ముక్కు, నోటికి ప్లాస్టర్లు వేసి, ఊపిరాడకుండా చేసి ఉంటుందని గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో దీప్తి ఈ ఘాతుకానికి పాల్పడిందని భావిస్తున్నామని, విచారణలో వాస్తవాలు తెలుస్తాయని సీఐ చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఇలా ఉంటే, అత్త, ఆడపడుచు, భర్త వేధింపులు తాళలేకున్నానని దీప్తి తమకు వాయిస్ మెజేస్‌లు పెట్టి ఈ ఘాతుకానికి పాల్పడిందని దీప్తి తల్లి అరుణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాకినాడ టూ టౌన్ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు.

పురుగు మందు తాగిన కుటుంబం

- గల్ఫ్ వెళ్లిన మహిళ పట్టించుకోవడం లేదని మనస్తాపం
- భర్త, ఇద్దరు పిల్లల అఘాయిత్యం

మలికిపురం: ఉపాధి కోసం విదేశానికి వెళ్లిన మహిళ తమను పట్టించుకోవడం లేదన్న మనస్తాపంతో ఆమె భర్త, ఇద్దరు పిల్లలు పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరిన ఉదంతమిది. మండలంలోని కేశనపల్లి గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు, తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పలివెల నాగేశ్వరరావు భార్య లక్ష్మి ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లింది. ఏళ్లు గడుస్తున్నా తమను పట్టించుకోవడం లేదని నాగేశ్వరరావు, వారి కుమారుడు సుమన్, కుమార్తె ప్రశాంతి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆమె స్వగ్రామానికి రాలేదు. మాట్లాడాలని ఫోన్ చేసినా స్పందించడం లేదు.
కనీసం కుటుంబ పోషణకు డబ్బు కూడా పంపించడం లేదు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావుతో పాటు, వారి పిల్లలిద్దరూ బుధవారం ఉదయం పురుగు మందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న వీరిని స్థానికులు గుర్తించి, రాజోలు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై మలికిపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు

కంబాలచెరువు: దొంగతనం కేసులో ఇద్దరికి ఆరు నెలల కారాగార శిక్ష విధిస్తూ ఐదో ఏజీఎఫ్‌సీఎం న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి బుధవారం తీర్పునిచ్చారు. స్థానిక పీఅండ్‌టీ కాలనీ వేంకటేశ్వరస్వామి గుడి వీధికి చెందిన నల్లమిల్లి వరలక్ష్మి 2021 ఫిబ్రవరి 20న ఇంటి పెరట్లో ఉండగా, క్వారీ మార్కెట్‌కు చెందిన వడ్డి శ్రీధర్‌దాస్, బర్రె శేఖర్ గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఆమె మెడలోని బంగారు చంద్రహారం, మంగళసూత్రాల తాడును లాక్కుని పారిపోయారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి అల్లుడు కర్రి రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్సై రామ్మోహన్ కేసు నమోదు చేశారు. అసిస్టెంట్ ఏపీపీ బీవీ రామ్మోహనరావు కోర్టులో వాదనలు వినిపించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

చెరువులో పడి మేకల కాపరి మృతి



కుటుంబరావు మృతదేహం

నల్లజర్ల: ఫిట్స్ రావడంతో చెరువులో పడిన మేకల కాపరి మృతిచెందిన సంఘటన ఇది. వివరాల్లోకి వెళితే, పోతవరానికి చెందిన జువాల కుటుంబరావు(55) మేకల కాపరిగా జీవిస్తున్నాడు. బుధవారం మేకలు తోలుకుని యర్నగూడెం వైపు బయలుదేరాడు. మార్గం మధ్యలో ఫిట్స్ రావడంతో గట్టుపైనుంచి పాత్రుని చెరువులో పడిపోయాడు. ఎవరూ గమనించక పోవడంతో మృతి చెందాడు. సాయంత్రం అటుగా వెళుతున్న కొందరు చెరువులో తేలుతున్న మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై తమకు సమాచారం అందలేదని ఎస్సై పీవీ సత్యనారాయణ తెలిపారు.

మహిళ మెడలో బంగారు మంగళసూత్రాల అపహరణ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామ దేవత రావులమ్మతల్లి తీర్థంలో ఓ భక్తురాలి మెడలోని బంగారు మంగళసూత్రాల తాడును ఇద్దరు దొంగలు అపహరించారు. నాలుగు కాసుల బరువైన ఈ మంగళసూత్రాల తాడు విలువ రూ.3 లక్షలు ఉంటుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇరుసుమండకు చెందిన దొమ్మేటి రాధాసూర్యనారాయణ, అతని భార్య గంగాభావాని కుటుంబ సమేతంగా మంగళవారం సాయంత్రం అగ్రహారం గ్రామ దేవత రావులమ్మతల్లి తీర్థానికి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని, తీర్థం తిలకించి ఇంటికి వెళుతున్న సమయంలో రాత్రి 9.30 ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు గంగాభావాని మెడలో ఉన్న బంగారు సూత్రాల తాడును లాక్కొని పరారయ్యారు. ఆమె తేరుకునే లోగా స్థానిక ఉన్నత పాఠశాల రహదారి నుంచి వారు పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే గ్రామంలో గతంలో రెండుసార్లు మహిళల మెడలో బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు తాటాకిళ్లు దగ్ధం

నాలుగు కుటుంబాలు నిరాశ్రయం

అంబాజీపేట: మండలంలోని వాకలగరువు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. నాలుగు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాకలగరువు పంచాయతీ పరిధిలోని బుల్లి కాలనీలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి, రెండు తాటాకిళ్లు పూర్తిగా కాలిపోయాయి. వీటిలో నాలు గు కుటుంబాల వారు జీవిస్తున్నారు. వారి గృహోపకరణ వస్తువులతో పాటు, దుస్తులు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు బూడిదయ్యాయి. ఈ ఘటనలో దాకే శ్రీనివాసరావు, దాకే వెంకటరావు, ముత్తాబత్తుల వీరవెంకట సత్యనారాయణ, ముత్తాబత్తుల దుర్గారావు కుటుంబాలు నిరాశ్రయమయ్యాయి. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ బుధవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. నిత్యావసర సరకులను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ మృతదేహం లభ్యం

- పోలీస్‌స్టేషన్ వద్ద మృతదేహంతో బంధువుల ఆందోళన
- అత్తింటి వేధింపులే కారణమంటున్న తల్లిదండ్రులు



అట్ల సౌమ్య (ఫైల్)



పోలీస్‌స్టేషన్ వద్ద మృతదేహంతో ఆందోళన

కరప: ఇంటి నుంచి బయటకెళ్లి అదృశ్యమైన మహిళ యానాం సమీపంలో గోదావరిలో శవమై తేలింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు, కాజులూరు మండలం డేగలపేట గ్రామానికి చెందిన దేవు త్రిమూర్తులు, చక్రమ్మ రెండో కుమార్తె సౌమ్య(23) రెండేళ్ల క్రితం సుబ్బరాజును ప్రేమ వివాహం చేసుకుంది. వారికి 14 నెలల పాప ఉంది. సౌమ్య మంగళవారం అత్తతో గొడవపడి బయటకు వెళ్లిపోయింది. దీనిపై కరప పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసిన విషయం విదితమే. బుధవారం ఆమె మృతదేహం పుదుచ్చేరి రాష్ట్రం యానాం వద్ద గోదావరిలో లభ్యమైంది. యానాం వంతెన పైనుంచి దూకి ఉంటుందని అక్కడి పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని వెలికితీసి, యానాం ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి వద్ద లభ్యమైన ఆధారాల ప్రకారం ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించి, మృతదేహాన్ని అప్పగించారు. అదనపు కట్నం కోసం భర్త వేధింపులు, మరోవైపు అత్తింటి వేధింపులు భరించలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు, బంధువులు యానాం పోలీసులకు ఫిర్యాదు చేయగా, అక్కడ కేసు నమోదైంది. బుధవారం రాత్రి మృతదేహాన్ని కరప పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి మృతురాలి బంధువులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చారని వారు చెప్పారు. అవి చాలవంటూ అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వేధింపులు భరించలేకే ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు విలపించారు. తమతో మాట్లాడటానికి కనీసం ఫోన్ కూడా ఇచ్చేవారు కాదని ఆరోపించారు. ఫోన్ ఇచ్చి ఉంటే అత్తింటి బాధలు తెలిసేవని, తమ కుమార్తెను రక్షించుకునేవారమన్నారు. తమకు న్యాయం చేయాలంటూ బాధితులు కోరారు. కరప ఎస్సై టి.సునీత మాట్లాడుతూ, యానాంలో నమోదైన కేసును ఇక్కడకు బదలాయించాల్సి ఉందన్నారు. ఆమె భర్త, అత్తమామలను అదుపులోకి తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. అంత్యక్రియల తర్వాత కేసు మార్పిడికి చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇచ్చారు. ఇరు కుటుంబాల వారితో మాట్లాడతామని ఎస్సై చెప్పడంతో ఆందోళన విరమించారు.

ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ



సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: ఊరు వెళ్లిన సమయంలో ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. బుధవారం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వాకతిప్ప విద్యుత్ ఉపకేంద్రం ఎదురుగా ఉన్న కాలనీకి చెందిన పేరూరి శ్రీనివాసరావు మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. సోమవారం కుటుంబ సమేతంగా అన్నవరంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నట్టు బుధవారం వారి ఇరుగుపొరుగు వారు శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. హుటాహుటిన ఆయన ఇంటికి చేరుకుని, చోరీ జరిగినట్టు గుర్తించారు. ఇంట్లో బీరువాలో పెట్టిన 12 కాసుల బంగారం, అర కిలో వెండి వస్తువులు, సుమారు రూ.1.30 లక్షల నగదు చోరీకి గురైనట్టు నిర్ధారించారు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై వెంకటేష్ క్లూస్ టీంతో పరిశీలించారు. సంఘటన స్థలంలో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. దొంగలు ఆ ఇంటికి అమర్చి ఉన్న సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేసినట్టు గుర్తించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రాష్ట్రంలో సాగుతున్న కక్షపూరిత పాలన

వైఎస్సార్ సీపీ మేధావుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి. చిత్రంలో వేణుగోపాలకృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో కేవలం కక్షపూరిత పాలన మాత్రమే సాగుతోందని, సంక్షేమం అంటూ ఏమీ లేదని వైఎస్సార్ సీపీ మేధావుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వై.ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పార్టీ మేధావుల విభాగం నియోజకవర్గ అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, అమలు చేయలేమని తెలిసీ, అధికార దాహంతో బూటకపు హామీలిచ్చి రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంతో గుణపాఠం చెప్పారన్నారు. ప్రజలంతా చంద్రబాబు మనస్తత్వం ఏమిటో, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిత్వం ఎటువంటిదో తెలుసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అన్యాయాలు, అక్రమాలతో పాటు, ప్రజలకిచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు, 143 హామీలను అమలుచేయని విషయాన్ని ప్రజల్లో తీసుకువెళ్లాలన్నారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి మేధావుల విభాగం పూర్తి స్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ, పార్టీ మేధావుల విభాగం ఏ కార్యక్రమం చేపట్టినా పూర్తి సహాయసహకారాలు అందిస్తానన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎస్‌వీఎస్ రెడ్డి, రొక్కం సంజీవయ్య, రాఘవరెడ్డి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, నియోజకవర్గ అధ్యక్షులు కర్రిశ్రీను, భీమేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.